

# దశతిరిగింది

- గుమ్మా ప్రసాదరావు

**కళాత్మకమైన చిత్రాలను తీసి తీసి బిచ్చమెత్తుకునే స్థితికి దిగజారిన నిర్మాత, ఇకలాభం లేదని సెక్సు, సస్పెన్సు, క్రైం, సెంటిమెంటు, యాక్షను మిళితమైన ఒక సంచలనాత్మక కథా చిత్రాన్ని తీసి, ప్రజలను ఉర్రూతలూగించి, బాక్సాఫీను హిట్‌తో కోటీశ్వరుడైనట్లు, నిన్నటి వరకు ఎందుకూపనికిరాని ఏబ్రాసి వెధవననే పేరు గడించుకున్న నేను ఉన్నట్టుండి ఒకే ఒక్క ఊపుతో మహామనిషినైపోయాను.**

అసలు ఇలా జరుగుతుందని నేను అనుకోలేదు. ఇలా జరగాలని ఆశించనూలేదు. కాకతాళీయం అంటే ఇదేమరి!

'ఓరీ ఏబ్రాసీ! బి.ఏ. పాసయ్యావు. మూడేళ్ళుగా రోడ్లు సర్వే చేస్తున్నావు. నీకు తిండి పెట్టడం దండగ' అని నాన్న విరుచుకుపడేవాడు.

'ఆ చాకలి వీరాస్వామి కొడుకు వెంకట్రావు నయం. మిడిల్ పాసై ప్యూను ఉద్యోగంలో చేరిపోయాడు. నీదీ ఒక బ్రతుకేనా? అసలు మూడు పూటలా మస్తుగా తినడానికి, తిరగడానికి నీకు మనస్సు వస్తున్నాదెలా? మీనాన్నగారు ఇంకా నిన్నెంత కాలం పోషిస్తారు?' అమ్మ సాధించేది.

కన్న తల్లిదండ్రులే ఇలా తూలనాడుతూ ఉంటే వీధిలోని వాళ్ళకు నేనెంత లోకువయ్యానో వేరే విన్నవించుకోనక్కరలేదు.

నిరుద్యోగ పర్వంలోంచి ఉద్యోగ పర్వంలోనికో లేదా చిరుద్యోగ పర్వంలోనికో వెళ్లాలని నేను చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతూనే ఉన్నాయి.

'బి.ఏ. పాసై మూడు సంవత్సరాల నుంచి ఉద్యోగం వేటలో ఉన్నావూ అంటే నీలో ఉద్యోగికి కావలసిన లక్షణాలూ ప్రతిభా లేవన్నమాట. మేం మాత్రం నీకెలాగ ఉద్యోగం ఇస్తాం?'

'అనుభవం బొత్తిగా లేదే! సారీ, కొంత అనుభవం సంపాదించిన తరువాతరా. అప్పుడు చూస్తాం'

ఉద్యోగం సంపాదించడం నాకు తలకు మించినదని అనిపించింది.

స్వయం ఉపాధి పథకంమీద మనసుపోయింది. ఒకరిచేతి క్రింద బ్రతికే కంటే అది మరీ మంచిది. నాకు నేనే యజమానిని. నాకు నేనే నౌకర్ని. అక్కడా చుక్కెదురైంది. తిండి పెట్టడానికే బాధపడుతున్న మావాళ్లు ఆర్థిక సహాయం అందించలేం పొమ్మన్నారు.

ఇంత చదువూ చదివి టీస్టాల్ పెట్టలేను కదా! అలాగే సినిమా హాలు దగ్గర వేరుసెనగకాయలు అమ్ముకోలేను కదా!

ఇలాంటి స్థితిలో నేను లోకులకు చులకనయ్యాను అంటే అందులో అబ్బురంలేదు.

రామాయణం వదిలి పిడకల వేటలో పడ్డానంటారా?

సారీ, మొదటికేవస్తున్నాను.

ఇద్దరమో ముగ్గురమో ఒకచోట చేరేమంటే మాటా మంతీ ఉంటుందిగా!

"ఈరోజు వర్షం వచ్చే సూచనలున్నాయి" అని నేనంటే వాళ్లు ఆకాశం వంక మోరసారించి దట్టమైన నల్లని మేఘాలను చూసి 'చెప్పొచ్చాడయ్యా బోడి జ్యోతిషం. ఆకాశం మేఘాలతో అలముకొనివుంటే వర్షం రాకుండా ఉంటుందా?' అని ఈసడించేవారు.

'ఆ రైలు ఆలస్యంగా వస్తుంది. తొందరెందుకు? ఒక అరగంట ఆగి వెళ్దాం' అన్నాను.

మేం గంట ఆలస్యంగా వెళ్లినా రైలు రాలేదు.

"చూశారా! నాకు తెలుసు ఆలస్యంగా వస్తుందని. నయమే, ఇక్కడ పడిగాపులు పడే అవస్త తప్పింది" అన్నాను.

"ఒరేయ్ నీకు జ్యోతిష్యం వచ్చని పొంగిపోకు. ఈరోజుల్లో ఏ రైలు మాత్రం సమయానికి వస్తున్నది?"

అంటూ హేళన చేసేవారు.

నాకు జ్యోతిష్యం వచ్చని అనలేదే!?'

నన్నెందుకు చులకన చేస్తారు?

ఖర్మ!

మెతకవాడిని చూస్తే మొత్త బుద్ధి వేస్తుందట.

మరి ఇదీనంతేనేమో! నాకు ఉద్యోగం - సద్యోగం లేదుగా?

అసలు నాకు గుర్తింపు ఎలా వచ్చింది?

వీళ్లందరూ నాకు బ్రహ్మరథం ఎందుకు పడుతున్నారు?

ఒకరోజు ఉదయం ఎనిమిది గంటలకు లేచి వదిన కాఫీ ఇస్తుందేమోనని చూస్తున్నాను. ఇంకా అక్షింతల సీను పూర్తి కాలేదు.

"ఒరే శంకరం! బ్రహ్మాండంరా!

నీకోసం దేవీ దుకాణం నుండి అర కే.జీ. మైనూర్ పాక్ తెచ్చాను" అన్నాడు హరి పరుగు రుగున వచ్చి.

వాడికెందుకు మతిపోయిందో నాకు అర్థం కాలేదు.

"ఇంతకీ ఏమిటి విశేషం? మీ ఆవిడ మగపిల్ల వాడిని ప్రసవించిందా?" అన్నాను. ఏదో శుభం జరగకపోతే వాడు వుత్తి పుణ్యానికి మిఠాయి తెస్తాడా?

"నీనోటి చలవన మగపిల్లాడే వుడతాడనుకో. అయినా ఏమిట్రా ఆ హాస్యం. నాపెళ్లి అయి ఇంకా రెండు నెలలు కాలేదు" అన్నాడు చిరుకోపంతో.

అది చిరుకోపం కాదు పూర్తి కోపమే అని వాడు నా భుజం మీద వేసిన దరువు చెప్పింది.


"నువ్వొట్టి చాతకానివాడివనుకున్నాం కాని నీలో ఇంత ప్రతిభ ఉందని తెలియలేదురా" అన్నాడు. కాని వాడు అసలు విషయం చెప్పకుండానే వెళ్ళిపోయాడు.

నన్ను అభినందించేవాళ్ళు బారులు తీరి క్యూలో నిలుచున్నారు. మా ఇంటి ముందు, నాతో కరచాలనం చేసేవాళ్ళు, మిఠాయో పళ్ళో సమర్పించేవాళ్ళు, ఆశీర్వదించేవాళ్ళూ, వీళ్ళందరికి ఒక్కమారు ఎందుకు పిచ్చి పట్టిందో నా వూహకు అందలేదు.

"ఒరేయ్! శంకరం! ఏమిట్రా విశేషం!" మా నాన్న అడగనే అడిగాడు.

"నాకు మాత్రం ఏం తెలును?" అన్నాను.

"నువ్వు చెప్పిన భవిష్యవాణి నిజమైందటగా! ఈ విద్య ఎప్పుడు సాధించావు?" అతను విస్మయంతో అడిగారు.



## కటింగ్

*విలేఖరి: మొట్టమొదటిసారిగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు కదా, మీ లక్ష్యం ఏమిటి?*

*మంత్రి: మొదట ఏదైనా కటింగ్ చెయ్యాలనుకుంటున్నాను.*

*విలేఖరి: కటింగా?*

*మంత్రి: అపార్థం చేసుకోకండి, 'రిబ్బన్ కటింగ్!'*

కొరిశేల మల్లికార్జునరావు [నంద్యాల]

అసలు ఆటలంటే నాకు ఆసక్తిలేదు. ఇమ్రాన్‌ఖాన్, కపిల్‌దేవ్‌ల్లో ఎవరు గొప్ప గోల్‌కీపరో నాకు తెలియదు. గత ఒలింపిక్స్‌లో మన జట్టు హాకీలో ఎన్నిరన్నులతో లేదా వికెట్లతో ఓడిపోయిందో నాకు తెలియదు. ఆసియా ఆటల్లో క్రికెట్‌లో పాకిస్తాను ఎన్ని గోలులతో తమ మీద ఘనవిజయం సాధించిందో నాకు తెలియదు. అయితే ఈమధ్య మావాళ్ళు ఏసియాడ్ గురించి మాట్లాడుతూ ఉంటే కబడ్డీలో బంగారు పతకం ఎవరికి దొరుకుతుంది అన్న ప్రశ్న తలెత్తింది. కబడ్డీ అంటే నాకో సంగతి గుర్తుకొచ్చి "కబడ్డీలో స్వర్ణం మనకే దక్కుతుంది. అలా కాకపోతే నా నాలిక కోసేస్తాను" అన్నాను. ఎవరూ నన్ను నమ్మలేదు.

"శంకరం! ఆఖరి నుంచి మొదటి నంబరు కాకపోతే అదేనయం" అన్నాడు హరి.

నాకేం తెలును. అంతర్జాతీయ క్రీడలలో మనవాళ్ళు అడుగు మెట్టు మీదనే ఉండాలనుకుంటారని?

నేను చెప్పింది నిజమైంది. అందుకే నాకీ సన్మానాలట. ఆ తరువాత నన్నందరూ అందలం ఎక్కించారు. తంతే బూర్లె బుట్టలో వడ్డట్టైంది.

తమ జాతకాలు చెప్పించుకుందికి ఎవరో ఒకరు రాసాగారు. నా నిరుద్యోగ సమస్య తాత్కాలికంగా నైతేనేం తీరిపోయింది.

జాతకాలకు నాకూ చుక్కెదురు, అయినా రాత్రిళ్ళు ఏదో వారపత్రికలో వారఫలాలు చదివి మరునాడు 'రెండింట కుటుంబ ధనస్థానంలో గురువు ఉచ్చలో ఉన్నాడు శుభాలు, ఆదాయం తగినంత ఇస్తాడు. ఆరింట రవి ఆరోగ్యం, యత్నసిద్ధి! ఇలాగే ఏదో వాగేవాడిని.

పుస్తకంలో వాక్యాలేమో, వాళ్ళు నిజమేనని నమ్మేవాళ్ళు.

అయితే అసలు రహస్యం ఇప్పటికీ చెప్పరన్న నమ్మకంతో మీకు మాత్రం చెప్తున్నాను ఆ రహస్యం ఏమిటో!

కబడ్డీ ఆటంటే కాళ్ళు పట్టుకు దిగలాగడం కదా! ఈ ఆటలో మన భారతీయులకు అద్వితీయమైన నేర్పు ఉంది. కపిల్‌దేవ్ గవాస్కర్ కాళ్ళు పట్టుకులాగినట్లు, భాస్కరరావు అన్న కాళ్ళు పట్టులాగినట్లు, చరణ్‌సింగ్ మొరార్జీ కాళ్ళు పట్టుకు లాగినట్లు ఇలా... ఎందరో...? ఆటల్లో కాదు, రాజకీయాలలోనే కాదు. ప్రతీరంగంలోనూ మనవాళ్ళు ఈ విద్యలో సిద్ధహస్తులు. అందుకే కబడ్డీలో మనతో పోటీపడి ఏదేశం గెలవలేదు. నా ఊహకు హేతువది.

ఏమైతేనేం నా దశ తిరిగింది. ●

